‘ఉపాధి’ సంత... తీరనున్న చింత..!

- ఈజీఎస్ నిధులతో అంగళ్ల నిర్మాణాలు
- తీరనున్న దూరభారం కష్టాలు
- గరిష్టంగా రూ. 15 లక్షల వరకు ఖర్చు

హుజూరాబాద్‌రూరల్: ఉపాధిహామీ నిధులతో సంతలు(అంగళ్లు) నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఉపాధిహామీలో ఇప్పటికే గ్రామాల్లో హరితహారం, మిషన్‌భగీరథ, సీసీరోడ్లు, రైతువేదికలు, పశువులు, గొర్రెల పాకలు, పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు, మరుగుదొడ్లు, కంపోస్టుషెడ్లు, పాంపాండ్లు, ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు. వీటితో పాటు అంగళ్ల నిర్మాణాలకు అవకాశం కల్పించినా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఆదరణకు నోచుకోలేదు. తాజాగా పల్లెల్లో సంతలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముందుకొచ్చే పంచాయతీల్లో ఏర్పాటుచేయాలని భావిస్తోంది. హుజూరాబాద్ మండలంలో 19 గ్రామపంచాయతీలుండగా, వాటి అనుబంధ గ్రామాలను కలుపుకుని మండలంలో 23 గ్రామాలున్నాయి.



హుజూరాబాద్ పట్టణంలోని సూపర్ బజార్ రోడ్డు పక్కనే కూరగాయల విక్రయాలు

సంతల నిర్మాణం ఇలా...

కేటగిరి-1 విభాగంలో పెద్ద పంచాయతీల్లో 30 గదలుకు రూ.15 లక్షలతో నిర్మించాల్సి ఉండగా అందులో ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలు, పంచాయతీ వాటా రూ.5 లక్షలున్నాయి. కేటగిరి-2లో చిన్న గ్రామపంచాయతీల్లో 20 రూములకు రూ. 12.50 లక్షలుండగా ఇందులో ఉపాధిహామీ నిధులు రూ.9లక్షలు, పంచాయతీ వాటా రూ.3.50లక్షలు ఉన్నాయి.

తీరనున్న దూరభారం...

మండలంలోని ఆయా గ్రామాల్లో కూరగాయలు, వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు కూరగాయలు అమ్మాలంటే హుజూరాబాద్, జమ్మికుంట, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు రవాణా ఖర్చులు భరిస్తూ అక్కడికి వెళ్తే.. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారితో స్థానిక వ్యాపారులు పోటీ పడలేక తక్కువ ధరకే విక్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల్లో స్థానిక సంతలను ఏర్పాటు చేస్తే ఏ గ్రామంలో పండించిన కూరగాయలు అదే గ్రామంలో అమ్మి ఆర్థికంగా లబ్ధిపొందే అవకాశం ఉంది.

హుజూరాబాద్ పట్టణమే దిక్కు..

హుజూరాబాద్ పట్టణంలో ప్రతీ గురువారం సంత జరిగే సమయంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి మెజార్టీ స్థాయిలో వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు వ్యాపారులు వస్తుంటారు. కానీ ఏ గ్రామంలో సంత లేకపోవడంతో మండలంలోని స్థానిక వ్యాపారులు హుజూరాబాద్ పట్టణంపైనే ఆధారపడాల్సి వస్తోంది.

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి

పట్టణాల్లో సమీకృత మార్కెట్ యార్డుల మాదిరిగా పల్లెల్లోనూ అంగళ్ల ఏర్పాటుతో స్థానికంగా పండ్లు, కూరగాయాలు, వివిధ రకాల సామగ్రి అమ్ముకునేవారికి ఎంతో దోహదపడుతుంది. గ్రామ జనాభా, స్థలం, నిధుల లభ్యతను పరిగణనలోకి తీసుకుని గ్రామపంచాయతీలే నిర్మాణాలకు ముందుకు రావాల్సి ఉంది. గదులతో పాటు ప్లాట్‌ఫాం నీటివసతి, మూత్రశాలలు, మురుగు కాల్వలు, పార్కింగ్ స్థలాలు అభివృద్ధి చేస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి వాటాధనం చెల్లిస్తే నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

స్థలాల లభ్యతే అసలు సమస్య...

మండలంలోని ఆయా జీపీల్లో సంతలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా జీపీ పాలకవర్గానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉంది. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వం స్థలం ఉండగా, మరికొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు అనువైన ప్రదేశంలో లేక సంతల ఏర్పాటు సందిగ్ధంగా మారే అవకాశం ఉంది. సమీపంలోని రెండు, మూడు గ్రామాలను కలుపుకుని అనువైన ప్రభుత్వస్థలంలో సంతలు ఏర్పాటుచేస్తే కొంతమేరకు సమీప గ్రామల ప్రజలకు ఉపయోగపడే అవకాశంతో పాటు వ్యాపారులకు సైతం లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కానీ స్థలాల లభ్యత అంగళ్ల నిర్మాణాలకు సమస్యగా మారుతోంది.

సంత ఏర్పాటుచేయాలి



మా గ్రామంలో స్థానికంగా సంత ఏర్పాటు చేయకపోవడంతో ప్రతీ గురువారం హుజూరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు బాగైతున్నాయి. దీనికి తోడు ధరలు ఎక్కువవుంటున్నాయి. గ్రామంలో సంతను ఏర్పాటుచేస్తే దూరభారం, సమయం కలిసి వస్తుంది. ధరలు అదుపులో ఉంటాయి.

– రెడ్డబోయిన సమ్మక్క, గ్రామస్తురాలు, రంగాపూర్

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలో అంగడి లేకపోవడంతో కూరగాయలు, పండ్లు కోనాలంటే పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. గ్రామం నుంచి పట్టణానికి వెళ్లాలంటే రవాణా ఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో సంత ఏర్పాటుచేయాలి.

– గిన్నారపు మహేందర్, గ్రామస్తుడు, జూపాక

జీపీలు ముందుకు రావాలి



ఉపాధిహామీ పథకంలో సంతలను గ్రామాల్లో ఏర్పాటుచేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పిస్తోంది. జీపీలకు అదనపు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు గ్రామపంచాయతీలు సంతలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలి.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, హుజూరాబాద్.

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ ఆదేశాలతో ఆదివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా వంగ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీక్‌చేసి విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడడం సరికాదన్నారు. సీఎంకు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసుపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులపై లేదని విమర్శించారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

మానకొండూర్: పేపర్ లీక్ వ్యవహారంపై మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి డిమాండ్ చేశారు. ఆదివారం మానకొండూర్‌లోని పల్లెమీది చౌరస్తాలో రాస్తారోకో చేసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఈ వ్యవహారంపై మంత్రి కేటీఆర్ బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

శంకరపట్నం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై కేశవపట్నంలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేసి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ -వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. లీకేజీకి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి



పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పరిశీలిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకన్న
- టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం
- కోరపల్లిలో నెలవాలిన మొక్కజొన్న పంటల పరిశీలన

జమ్మికుంట: అకాల వర్షం, వడగండ్ల దాటికి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40వేలు నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కోరపల్లి, కాపులపల్లి గ్రామాల్లో నెలకొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

గంగాధర: వడగండ్ల వర్షాలకు పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మండలంలోని కురిక్యాలలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

నష్ట పరిహారం అందించాలి..

చొప్పదండి: అకాల వర్షాల ధాటికి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఆదివారం కోరారు. రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వరి, మొక్కజొన్న, మామిడి తోటలు, కూరగాయల సాగుచేసిన రైతులకు పరిహారం అందించాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

గన్నేరువరం: ఆకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆకాల వర్షాలతో నష్టపోయిన పంటలను మాదాపూర్‌లో పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలతో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మామిడి తోటలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

పంటల పరిశీలన

అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను ఏవో కిరణ్మయి పరిశీలించారు. ఖాసీంపేట, మాదాపూర్ గ్రామాల్లో మొక్కజొన్న పంటల వివరాలు నమోదు చేసుకున్నారు. ఉద్యావనశాఖతో పాటు మామిడితోటలకు ఆపారనష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. సుమారు 170 నుంచి 200 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టంవాటిల్లిందని అధికారులు గుర్తించారు.

రైతులు అధైర్య పడొద్దు

- ప్రభుత్వ విప్ , ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



హిమ్మత్‌నగర్‌లో రైతులతో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

వీణవంక: రైతులకు రాష్ట్ర ప్రభుత్వ అండగా ఉందని, అధైర్య పడొద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామాలు, పలు గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను, ఇళ్లను పరిశీలించారు. వివరాలు నమోదుచేసుకోవాలని తహసీల్దార్ రాజయ్య, ఏవో గణేష్‌ను ఆదేశించారు.

ఇల్లందకుంటలో పర్యటన..

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడారు. మండలంలో మొత్తం 1600 ఎకరాలలో పాక్షికంగా నష్టపోయినట్లు తెలిపారు. పూర్తిగా పంటనష్టపోయిన రైతు వివరాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి ప్రతిష్టాపన

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలో నూతనం నిర్మించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణకమిటి, వేద పండితులు కౌశిక్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పోచమ్మ తల్లికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ మహాదేవ లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

ప్రభుత్వ విప్‌కు ఘన స్వాగతం

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వవిప్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి హుజూరాబాద్‌కు వచ్చిన పాడి కౌశిక్‌రెడ్డిని ఆదివారం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్ వద్ద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు కౌశిక్ రెడ్డిని గజమాలతో ఘనంగా సన్మానించారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ

మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లిలోని పెద్దమ్మ ఆలయంలో విగ్రహా ప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా హాజరై నూతన పంచాగాన్ని పాడి కౌశిక్‌రెడ్డి ఆవిష్కరించారు.

క్లుప్తంగా

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

చిగురుమామిడి: పొదుపు సంఘంలో రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా చెల్లించాలని మండలంలోని బొమ్మనపల్లి గ్రామ ఆదర్శ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు తాడ వాసుదేవరెడ్డి కోరారు. ఆదివారం పొదుపుసంఘం ఆవరణలో ఏర్పాటుచేసిన 22వ వార్షిక మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు సంఘంలో 526 మంది సభ్యులున్నారని, క్రమం తప్పకుండా రుణాలు చెల్లిస్తే బోనస్ వస్తుందన్నారు. రూ.56 లక్షల లాభంతో సంఘం నడుస్తోందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నలుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు తాడ వాసుదేవరెడ్డి, మామిడి శ్రీనివాస్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సైదాపూర్ పొదుపుసంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సమితి అధ్యక్షుడు జెల్ల శ్రీనివాస్, సమితి గణకులు అనగోని వీరన్న, పెండ్యాల గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వీణవంక: మండలంలోని బ్రహ్మణపల్లిలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు పోచాలు అనే వ్యక్తి ఇళ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డిఆర్థికసాయం అందించారు. హిమ్మత్‌నగర్‌లో మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతినగా పంటలను ఆయన పరిశీలించారు. ఆకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరాకు రూ.80వేల చొప్పున నష్టపరిహారం రాష్ట్రప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి, సంది సురేందర్‌రెడ్డి, సదానందం గౌడ్, సీనియర్ నాయకులు మారం తిరుపతిరెడ్డి, సమ్మయ్య, చిన్న వెంకటేష్, వెంకన్న, ప్రశాంత్, చేపూరి రాజు, కోమాల్‌రెడ్డి ఉన్నారు.

85 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం



పంటను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాస్

శంకరపట్నం: అకాలవర్షానికి శంకరపట్నం మండలంలో 85 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టంవాటిల్లినట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు. కొత్తగట్టు, కరీంపేట, ఏరడపల్లి, కాచాపూర్, మెట్‌పల్లి, కేశవపట్నం గ్రామాల్లో నేల కొరిగిన మొక్కజొన్న పంటలను ఆదివారం పరిశీలించారు. 45మంది రైతులు యాసంగిలో వేసిన మొక్కజొన్న పంట 85 ఎకరాల్లో అకాలవర్షానికి నష్టం సంభవించిందన్నారు. ఏఈవో శ్రావణి, రైతులు నాయకులు ఉన్నారు.

కిష్టంపల్లిని పంచాయతీ చేయాలి

రామడుగు: మండలంలోని కిష్టంపల్లి హామ్లెట్ గ్రామాన్ని గ్రామ పంచాయతీ చేసేందుకు మద్దతు తెలపాలని గ్రామానికి చెందిన గొల్లపల్లి వినోద్ ఆదివారం మాజీ మంత్రి, బీజేపీ నాయకులు సుద్దాల దేవయ్యను కోరారు. తమ పార్టీ గ్రామపంచాయతీ ఏర్పాటుకు మద్దతు ఇస్తుందని సుద్దాల తెలిపినట్లు వినోద్ పేర్కొన్నారు.

పొదుపు సంఘం అధ్యక్షుడిగా పల్లె అంజయ్య



తిమ్మాపూర్: పొరండ్లలోని ఆదర్శ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా పల్లె అంజయ్య మూడోసారి ఎన్నికయ్యారు. సంఘం 26వ వార్షిక మహాసభ ఆదివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక నివేదికను ప్రవేశపెట్టగా పలుఅంశాలపై చర్చించి సభ్యులు ఆమోదించారు. 12 డైరెక్టర్ స్థానాల్లో నాలుగు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికజరిగింది.డైరెక్టర్‌లుగా నీలం రాజ్‌కుమార్, నాగపురి మహేశ్, నాగపురి శ్రీనివాస్, బొజ్జ కొమురయ్య ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో పల్లె అంజయ్య అధ్యక్షుడిగా, నాగపురి శ్రీనివాస్‌గౌడ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అంజయ్యను సభ్యులు అభినందించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దెకు చెందిన జర్నలిస్ట్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అల్లి నరేందర్ తల్లి అల్లి లచ్చమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా వారి కుటుంబాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పరామర్శించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, తాళ్లపల్లి రమేశ్, పైళ్ల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొల్లూరు కిరణ్, వేముల పుష్పలత, ఎండీ.అప్సర్, సొల్లు సునీత, సమ్మయ్య, ఎండీ.సలీం తదితరులు ఉన్నారు.

పంటల బీమా అమలులో నిర్లక్ష్యం



మామిడి కాయలు పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

చొప్పదండి: పంటల బీమా అమలులో రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కాట్నపల్లిలో పరిశీలించారు. ప్రభుత్వం మానవతా ధృక్పదంతో వ్యవహరించి ఎకరాకు రూ.50 వేలు, మామిడి తోటలకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని కోరారు.

శ్రీభ్రమరాంభ మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చొప్పదండి: మండలంలోని శ్రీగట్టు మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి, కాట్నపల్లి, కొలిమికుంట గ్రామాల శివారులో కొలువైన శ్రీమల్లిఖార్జునస్వామి, భ్రమరాంభ దేవి ఆలయంలో ఒగ్గుపూజారులు ఏర్పాటుచేసిన పెద్దపట్నంపై స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు అగ్నిగుండాలపై స్వామివారితో ఊరేగారు. తరలివచ్చిన భక్తులకు కొలిమికుంటకు చెందిన ఎన్ఆర్ఐ దంపతులు పూరెళ్ల సౌమ్య, సత్యనారాయణ అన్నదానం చేశారు. మల్లికార్జున్, ఐలయ్య, బక్కయ్య, తదితరులు పూజలు చేశారు. సత్తు నర్సయ్య, గుర్రం దామోదర్ రెడ్డి, నెరుమట్ల మల్లేశం, గుర్రం నందిరెడ్డి, పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వేసవికాల శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్

ఇల్లందకుంట: జమ్మికుంటలోని చాణక్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరాన్ని మండలంలోని బూజునూర్, సీతంపేట గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి బూజునూరు సర్పంచ్ అరుణ హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సామాజిక కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. అనంతరం సీతంపేట సర్పంచ్ వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి వేసవికాల శిబిరాలతో పల్లెవాసులకు పారిశుధ్యం ప్రాధాన్యత, మూఢనమ్మకాల నిర్మూలన, వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు వంటి అంశాలపై గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులు శ్రమదానంచేసి పాఠశాల పరిసరాలను శుభ్రంచేశారు. కళాశాల సూపరింటెండెంట్ దబ్బెట విజయారవీందర్, డైరెక్టర్లు ప్రభాకర్, విజేందర్, శ్రీనివాస్, శివ, కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సాయికృష్ణ, వంశీ, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నల్లగొండ ఆలయ భూములు కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ జీపీ పరిధిలోని సర్వేనంబర్ 8/బీ/బీ/1లోని సుమారు 2.25 ఎకరాల భూమిలో 0.25 గుంటల భూమి ఇతరుల పేరిట పట్టా ఉండడంతో అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు ఆదివారం సమావేశం నిర్వహించారు. నల్లగొండ, బాలయ్యపల్లి, మక్తపల్లికి సంబంధించిన గ్రామస్తులు, పలు పార్టీల నాయకులు సమావేశానికి హాజరయ్యారు. నల్లగొండ మాజీ సర్పంచ్ దన్నమనేని నర్సింగరావు మాట్లాడుతూ.. 70ఏళ్లుగా నల్లగొండ లక్ష్మీనసింహస్వామి ఆలయం పరిధిలో కొనసాగుతున్న అంగడి(పశువులసంత) భూములు రెవెన్యూ రికార్డుల్లో పశువుల అంగడి భూములుగా నమోదుచేసి ఉన్నాయన్నారు. ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా గతంలో ఎన్నోసార్లు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కి వినతిపత్రాలు అందించామన్నారు. ఈ భూములను వేరే వ్యక్తులకు పట్టా మారిడి చేయడం దారుణమన్నారు. ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగడి భూములతో పాటు దేవాలయ భూములు కబ్జాకు గురవుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి ఆరోపించారు. రికార్డులను తారుమారు చేసిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరణి పథకంతో ఎంతోమంది భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ఈ ధరణితో తిమ్మాపూర్ మండలంలో భూములు కోల్పోయిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ మార్క మొండయ్య గౌడ్, ఉప సర్పంచ్ కవ్వంపల్లి తిరుపతి, మార్క కనకయ్య, బీజేపీ జిల్లా నాయకులు తమ్మిశెట్టి మల్లయ్య, తాళ్లపల్లి రాజుగౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాట్నపల్లిలో పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి మాలవాడ ప్రజలు ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఇంటికో బోనంతో ర్యాలీగా వెళ్లి గ్రామశివారులోని పోచమ్మ ఆలయంలో మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కట్టెకోల తార, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చివరి తేదీ

హుజూరాబాద్‌రూరల్: జిల్లాలోని గంద్రపల్లి, హుజూరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు మార్చి 20వ తేదీ వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899